నిస్సహాయులు

ఇంకా తెల్లగా తెల్లవారనన్నా లేదు. కుదిపినట్టు లేపి కూర్చోబెట్టింది వెంకట్రామయ్యను భార్య రంగనాయకమ్మ.

సొమ్మసిల్లి నిద్రసుఖంలో పడిపోయిన ప్రాణిని ఆ విధంగా కప్పు విరిగి మీద పడుతున్నట్టు బలవంతాన లేపి కూచోపెడ్తే ఒక్కో సమయంలో కొందరు దయ్యాలు భూతాలు మీదబడి పీకినట్టు ఉక్కిరి బిక్కిరై వెర్రి చూపులు చూట్టం మొదలుపెట్టినా పెడతారంటే ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

సుమారుగా అంతపనీ తనకు జరిగినట్టుగా భావించినా అమిత సహనంతో తెల్లమొహం పెట్టి రంగనాయకమ్మ వేపు చూశాడు వెంకట్రామయ్య.

"కాస్త బావిలో నీళ్ళు తోడిపెడుదురుగాని లేవండి" అంది రంగనాయకమ్మ.

"నాకేం బోధపట్టంలేదు!" అన్నాడు వెంకట్రామయ్య మెల్లగా గుటక మింగుతూ.

'ఏముంది బోధపట్టానికి? ఆ పనిచచ్చింది పని మానుకుంది'' అంది రంగనాయకమ్మ.

"అంత ప్రమాదం ఏం జరిగింది ఉన్నట్టుండి మానుకుంటానికి?" అన్నాడు వెంకట్రామయ్య.

"సరేలెండి. ఇప్పుడా పురాణమంతా నిల్చున్నపాటున వర్ణించి మీ కెక్కడ విప్పిచెప్పను – ఆ బావి నాకు అలవిగాకుండా ఉంది. తొందరగా లేచి కాస్త నాలుక్కడవల నీళ్ళు లాగిపెట్టండి" అంది రంగనాయకమ్మ.

"బాగానేవుంది పద్ధతి! తెల్లవారుతుందంటే భయం. ఏ ఆటంబాంబుతోనో సిద్ధమవుతావు. అయినా ఇకమీద నువు నన్ను ఈవిధంగా వేళగానివేళ లేపదల్చుకుంటే కొంచెం సౌమ్యంగా లేపుతుండు ఎందుకైనా మంచిది" అన్నాడు వెంకట్రామయ్య.

"సౌమ్యంగా కాకపోతే మీదపడి పీకుతానంటారా ఏవిటండీ మరీనూ? దయచేసి అయిదారు కడవల నీళ్ళు తోడిపెట్టండి, ఇంకా పనులన్నీ అట్టాగే వున్నాయ్" అంది రంగనాయకమ్మ.

"ఇంతకుముందేగా నాల్గు కడవల నీళ్ళు తోడిపెట్టమన్నావు?" అన్నాడు వెంకట్రామయ్య.

"కాదుమరీ! ఇంతకూ, కాపరమంతా నాల్గు కడవ నీళ్ళతో చక్కబెడుతున్నా, సరేనా- తొందరగా బావిదగ్గరకు రండి" అంది రంగనాయకమ్మ.

"ఇంతమంది పనిమనుషులు మారుతున్నా ఇప్పటికీ వాళ్ళతో మెలిగే పద్ధతి ఓ పద్ధతికి రావడం జరగలేదన్నమాట" అన్నాడు వెంకట్రామయ్య బావిదగ్గరకు వచ్చి నుంచుని.

"ఇదిగో ఈ పనిమనుషులతో ఈ యింటిపనులు మీరు ఒక్కరోజు సాధించండి. మీకే తెలుస్తుంది నా అవస్థ" అంది రంగనాయకమ్మ వంటింటికి వెడుతూ.

"నేనంటం ఇన్నిసార్లు పనిమనుషుల్ని మారుస్తున్నా వీళ్ళను ఉపాయంగా పట్టుకురావటం నీవు గ్రహిస్తావా- అని" అన్నాడు వెంకట్రామయ్య బావిలోని నీళ్ళు లాగుతూ.

'మీ పద్ధతి చూస్తే విషయం తెలుసుకోకుండానే యీ పనిమనషుల్ని నేనే చెండుకుతిని సాగనంపుతున్నట్టు మాట్టాడుతున్నట్టుందే!" అన్నది రంగనాయకమ్మ, అంటుగిన్నెల్ని బావిపక్కకు తెస్తూ.

"కావలసిన అర్థం తీసే నేర్పు నీకుందని తెలుసుననుకో- ఇంతకీ సుబ్బాం పని కెందుకు రానన్నదో చెబితే వింటానుగా" అన్నాడు వెంకట్రామయ్య.

"లేకపోతే మీరు వినకుండా దాచిపెడుతున్నానంటారా ఏమిటి? నేను సుబ్బాన్నేమో రాచి రంపానబెట్టి బైటికి నెట్టినట్టుగా మీ ఉద్దేశం కనబడుతున్నది' అంది రంగనాయకమ్మ తిరిగి వంటింటోకి పోతూ.

"ఇదిగో-నువు దివ్యదృష్టితో మాట్లాడటం మొదలుపెడ్తే ఇహ నేననేదేమీ వుండదు. పోనీ- రోజంతా ఆఫీసులో వెట్టిచాకిరీ చేసొచ్చి పడుకున్నవాణ్ణి నువ్వా విధంగా లేపి ఈ బావిలో నీళ్ళు తోడించటం నీకేమయినా సబబుగా తోస్తున్నదా? పనిమనిషి విషయం ఇంకా పదిసార్లు అడుగుతానంటే అడగనూ మరి?" అన్నాడు వెంకట్రామయ్య ఒకక్షణం చెమట తుడ్చుకుంటూ.

"ఇవాళ రెండు కడవలు తోడేసరికే మీ కెక్కడలేని ఉద్రేకం వస్తున్నది. మీరు లేనప్పుడు ఎంత అర్భకురాలనయినా నేనెన్నిసార్లు చెంబెడు నీళ్ళు చొప్పున తోడుకున్నానో మీరు చూడగల్గారా?" అంది రంగనాయకమ్మ వంటింటి కిటికీ దగ్గరనుంచి.

"అసలీ బావిలో నీళ్ళు నిన్నూ నన్నూ ఎవరు తోడమన్నారని? ఇందాకట్నించి అంటుంటే నువ్వు సమాధానం చెప్పటం లేదు. ఇదుగో మళ్ళీ చెబుతున్నాను, ఇవాళ తోడితే తోడాను, రేపట్నుంచి ఇక ఎప్పటికీ ఈ పాతాళ బావి లోంచి ఒక్కచుక్క నీరన్నా

తోడను– తోడను– అంతే– ఇంకో పనిమనిషిని ఇవాళే మాట్లాడు" అన్నాడు వెంకట్రామయ్య రొప్పుతూ.

"సరే మాట్టాడక ఊరుకుంటారా ఏమిటి? మీ చేత మాటలనిపించుకోవటం నాకుమటుకు మనసా? ఏదో ఏడాదికి ఓనాడు యిబ్బందొస్తే మీ యింటికి మీరు చేసుకొంటున్నారుగాని పరాయివాళ్ళకేమీ చేసిపెట్టటంలేదు. బజారుకు వెళ్ళి కాసిని బొగ్గులు తేవాలి, కొంచెం బియ్యప్పిండి మరపట్టించుకురావాలి– ఇంకో రెండు కడవలు లాగిపెట్టి మరీ వెళ్ళిరండి" అన్నది రంగనాయకమ్మ పొయ్యిలో నుసి, అంట్లు తోమేదగ్గర పోస్తూ.

"ఇవ్వాల్టికి బొగ్గులు లేవా" అన్నాడు వెంకట్రామయ్య నిస్పృహతో రంగనాయకమ్మ వేపు చూస్తూ.

"ఈ పూట కుంటే సరిపోతుందా ఏమిటి! బియ్యప్పిండి డబ్బా మొన్ననే శుభ్రం చేసిపెట్టా, ఆ తరువాత వంటకాలు ఇట్టా వున్నయ్యేమని నన్ననవద్దు" అంది రంగనాయకమ్మ కుంపటి రాజేస్తూ.

"నాకోసం డబ్బాలన్నీ ఖాళీగా శుభ్రం చేసిపెట్టావన్నమాట? ఇవ్వాళ ఆదివారం కదా అనుకున్నా, అన్నట్టు పిండిమర ఇవాళ కట్టేస్తారేమో?" అన్నాడు వెంకట్రామయ్య.

"ఇవ్వాళ గాదుఁ ప్రతి సోమవారం కట్టేస్తారు" అంది రంగనాయకమ్మ.

"రక్షించావ్! ఇవ్వాళ నాకీ పిండిమర తలంటి తప్పదన్నమాట. అయినా యివన్నీ పనిమనుషుల ద్వారా అయ్యే పనులని నీకు తెలియకపోవటం ఆశ్చర్యంగా వుంది. అసలు ఇలాంటివి నాకు అంటకట్టొద్దని యిప్పటికి లక్షసార్లన్నా నీకు చెప్పివుంటా. అయినా నీ మతం నీదిగానే వుంది" అన్నాడు వెంకట్రామయ్య.

"ఎందుకూ మాటిమాటికీ అలా రొసరొసలాడ్తారు? మన అవసరానికి మనం చేసుకుంటానికీ? ఇహ ఎవరో ముష్ఠి వెధవలు చేసి పెడుతుంటేనే ఏమిటి ఈ జీవితాలు వెళ్ళబారేదీ?" అంది రంగనాయకమ్మ కాఫీకి కుంపటిమీద నీళ్ళు పెడుతూ.

"అయితే ఈ బావిలో నీళ్ళుతోట్టం నా జీవిత పరీక్షన్నమాట" అన్నాడు వెంకట్రామయ్య.

"మన జీవితాలనండి" అంది రంగనాయకమ్మ వచ్చి అంట్లు తోముతూ.

"ఏం, ఎగతాళిగావుందా నీకూ? మన అవుసరాలు ఏవికావు? మన గుడ్డలు మనం నేసి మనం కట్టుకోవచ్చు, మాదిగవాడిలాగ మన చెప్పులు మనం కుట్టుకుని మనం తొడుక్కోవచ్చు. ఇవన్నీ మనం చేసుకోవటం లేదేం?" అన్నాడు వెంకట్రామయ్య రంగనాయకమ్మ దగ్గరికి వెళ్తూ.

'ఎవళ్ళ వృత్తులు వాళ్ళు చేస్కుంటారు, వాళ్ళ జోలీ మనకెందుకు" అంది రంగనాయకమ్మ వెంకట్రామయ్యవేపు వింతగా చూస్తూ.

"అలాగే పనిమనుషులూను. ఇదిగో నీకు నేను మాటిమాటికి చెప్పేదల్లా ఇక్కడ ఈ బావిపని, పిండిమరపనీ, అక్కడ ఆఫీసులో ఆ గవర్నమెంటు డబ్బు లెక్కలు ఒక వ్యక్తివల్ల ఎంతమాత్రం కానిపనని తెలుసుకోమంటున్నా! అందుకే మన కష్టం మనకే దక్కకుండా పోతున్నా, ఐదో ఆరో ఈ పనిమనుషులకు బలవంతాన యిచ్చుకుంటున్నాం. అప్పుడే ఈ రెండు రెక్కగూళ్ళూ ఎలా పట్టుకు పోయినయ్యో చూడు! పక్కింటివాళ్ళను విచారించి ఈ పూటే ఇంకో పనిమనిషి విషయం ఫైనలుచెయ్యి" అన్నాడు వెంకట్రామయ్య.

"నాకు మట్టుకు సరదాటండీ పనిమనిషి లేకుండా ఈ అంట్లన్నీ తోముకుంటూ కూర్చోను. ఈ నాలుగు గిన్నెలు తోమానో లేదో రెండు చేతులూ కారం రాసిపట్టు భగభగ మండుతున్నయ్ చూడండి! ఇదిగో యివ్వాళే విచారించి ఇంకో పనిమనిషి విషయం తెలుసుకుంటాలెండి. వీళ్ళకు రానురాను, మరీ అంత డబ్బు దాహమైతే ఎట్లా? ఇవతల వాళ్లేం కాపరాలు చెయ్యనక్కర్లా?" అంది రంగనాయకమ్మ లేచి కుంపటిమీద నీళ్ళు దింపి కాఫీపొడి వేస్తూ.

"ఇచ్చే ఆరు రూపాయలు, వారానికోపూట తిండికి చాలదంటుందా సుబ్బాం? అన్నాడు వెంకట్రామయ్య రంగనాయకమ్మ వెనకనే వంటింటోకి వెళ్ళి.

"అబ్బే దీని విషయం ఇంకా అంతదాకా రాలేదులెండి. వెనక వెంకాం చాలదనేగా వెళ్ళిందీ" అంది రంగనాయకమ్మ.

"మరి ఎందుకు వెళ్ళిపోయింది సుబ్బాం!" అన్నాడు వెంకట్రామయ్య రంగనాయకమ్మ పక్కగా కూర్చుంటూ.

"ఆc. చపలచిత్తంముండ! ఐదు రూపాయలు అప్పు అడిగింది, లేదు పొమ్మన్నాను. అసలు ఏ రోజు వాళ్ళు అణా, అర్ధణా అని వేధించంది? ఒక్కసారే ఐదు రూపాయలు తెమ్మంటే యెక్కణ్ణుంచి తెస్తారు? అయినా ఈ జాతికి ఐదులు, పదులు అప్పు పెడితే ఈ జన్మలో దక్కినట్టే" అంది రంగనాయకమ్మ.

"సరే మన సంపాదనకు తోడు ఇవన్నీ కూడా ఎక్కడ నెత్తికి తెచ్చుకుంటాం, వదుల్తున్నవి చాలక? ఐనా అంత మాత్రానికే పని మానుకు పోయిందా! వచ్చే యీ ఆరు రూపాయలు పోగొట్టుకుని ఇంకోచోటికి పోతే వాళ్ళు ఇంత జీతం యిచ్చి పైన దానికి కావలసిన అప్పులన్నీ యిస్తారా పిచ్చిదిగాకపోతే?" అన్నాడు వెంకట్రామయ్య.

"దాని మొగుడికి జబ్బుగావుందట. మందిప్పిస్తానని ఆ అయిదూ యివ్వమంది. దానికి నెల జీతమిచ్చి ఇంకా వారమన్నా కాలేదు; చూస్తూచూస్తూ మళ్ళీ అయిదు

రూపాయలు ఎలాగంట ఇవ్వటం? కోపం వచ్చి వెళ్ళిందేమోగాని రెండు రోజులయినాక మళ్ళీ అదే తిరిగి రాకుండా వుంటుందీ?" అంది రంగనాయకమ్మ కాఫీ డికాషను వడపోస్తూ.

"నువ్వు సందేహాలతో నా ప్రాణంతియ్యక కబురుచేసి అదికాకపోతే మరో పనిమనిషిని మాట్లాడు" అన్నాడు వెంకట్రామయ్య.

"దాని మొగుడుకు టైఫాయిడ్ జ్వరమట. యిప్పుడెలావుందో ఏమో మరి" అంది రంగనాయకమ్మ కాఫీ కలిపి వెంకట్రామయ్యకిస్తూ.

"టైఫాయిడా! దరిద్రులకు తక్కువ జబ్బులేమీ రావు! ఎవరి ఖర్మ వారిది. నా పర్సుతే బజారు వెళ్ళివస్తా. యీ బియ్యప్పిండి లేకుండా యివాళ్టికి ఏదోవిధంగా సరిపుచ్చే ఉపాయం ఉందా అని?" అన్నాడు వెంకట్రామయ్య.

"అదేమిటండీ మళ్ళీ అలా అంటారు. పోనీ యివ్వాళ పచ్చళ్ళతో సరిపుచ్చుకుంటారా!" అంది రంగనాయకమ్మ.

"సరే నీమాటే జరగనీ. ఆ బియ్యం సంచిలో తొందరగా పోసివ్వు పరవాలేదులే; కొంచెం తగ్గించి పొయ్యి బరువంతా ఒకనాడే మీదపెట్టకు"–

* * *

ఈ పనిమనిషి బెడద తప్పేటట్టు లేదనే నిర్ణయానికొచ్చాక, ఈ నిస్సహాయతకు బాధ్యులెవరనేది. వెంకట్రామయ్య ఆలోచనకు అందని విషయంగా వుంది. ఏరోజు పనిమనిషి మానుకుని తను బావిదగ్గర రెక్కలు విరుచుకునే దురవస్థ పడుతుందోననే భయంకర పీడకలలు వెంకట్రామయ్యను ఆవేశించినయ్. ఇటీవలే రత్తమ్మ అనే కొత్త పనిమనిషిని తన భార్య పనికిపెట్టింది. ఇవ్వాళ ఉదయం ఆ కొత్త పనిమనిషి రత్తమ్మ, తన భార్య మధ్య జరిగిన ఘర్షణ యింట్లోనేవున్న వెంకట్రామయ్య విన్నాడు. పనిమనిషి రత్తమ్మ తన పిల్లలిద్దర్ని, ముసలితల్లిని తనతో తీసుకువచ్చింది.

"వీళ్ళంతా ఎవరే?" అని తన భార్య రత్తమ్మను సౌమ్యంగా అడిగింది.

"ఇది నా అమ్మ ఈళ్ళు నాసంటోళ్ళు" అంది రత్తమ్మ.

"నిన్న ఆ చిన్నపిల్లనుమట్టుకే తెచ్చావే! యింకా వున్నారా నీకు పిల్లలూ!" అంది తనభార్య.

"ఇంకా యిద్దరు ఆడబిడ్డ లుండారండీ" అంది రత్తమ్మ.

"ఆడబిడ్డలా?" అంది తన భార్య.

"అవునండీ అమ్మగోరూ, నా పెద్దపిల్లలు. ఆళ్ళిద్దరికీ పెళ్ళిళ్ళయినయి" అంది రత్తమ్మ.

రత్తమ్మ పిల్లగావాఁల్ను కావ్‌కావ్‌మని ఏడుస్తుంటే రత్తమ్మ తల్లి గావాల్ను ఖంగు ఖంగుమని దగ్గుతూ పిల్లకు కూసిని పాలిమ్మంటున్నది రత్తమ్మతో.

"అదేమిటే నీపిల్లట్లా ఏడుస్తుంది?" అనడిగింది తన భార్య.

"అదేమోనండి అమ్మగోరూ తెల్లార్లు ఆవజాన ఏడుత్తా కూకుంది" అంది రత్తమ్మ.

"పాపం యీ గాలిలో దాన్ని అట్టా తిప్పకపోతే యీ ముసలిదానిదగ్గర యింట్లోనే అట్టిపెట్టి రాకపోయినావుటే?" అంది తన భార్య.

"ఈ గాలికే మా పిల్లలు సెడిపోతే యిక మేమేం బతుకుతాం అమ్మగోరూ. మా అమ్మకి కాలూచేతులు పడిపోయినయ్యమ్మగోరూ. పొద్దత్తమానం పనిజేసుండ పానంగనక యింటికాడ ఏమీతోసక నాయెంట వత్తానంటది. నేనంటే మా అమ్మకు బహుపానం. పెద్దదయిందిలెండి, అదేంటోనండీ అమ్మగోరూ, దగ్గు బట్టుకుందది మా అమ్మకు. ముసల్దానికి కాత్తె సద్దిబువ్వేమన్నా వుంటే పెట్టండి అమ్మగోరూ. దగ్గుతెర కాస్తె దగ్గుద్దీ" అంది రత్తమ్మ.

"ఒక్క మెతుకుంటే ఒక్క మెతుకు మిగల్లేదు. అసలు మా యింట్లో చద్దన్నాలు మిగలవు" అంది తన భార్య.

"పానీలే అమ్మగోరూ కూసిని సల్లసుక్కుంటే పొయ్యండీ ముసల్దీ పసిదీ తాగుతారు; నిన్న మాపిటాల ఇంతంటే యింత బువ్వ తినటానికి లేకపోయిందమ్మగోరూ" అంది రత్తమ్మ.

"అదేమిటే రత్తమ్మా మీ పనివాళ్ళు మమ్మల్ని నిలువునా యిట్లా తోడతారు? కొంచెం అన్నం, కొంచెం మజ్జిగ, కాసిని డబ్బులనీ; ఆ కొన్న పాలల్లో సహం పొంగి పొయిలోనే మాడినయ్; ఆ వున్న కొంచెంలో పందేరా లెక్కడ చేస్తూ కూచోను? పోనీ మీ కిస్తామన్న జీతంలో ఒక్క కానీ తగ్గిస్తే అప్పుడనవచ్చు మమ్మల్ని. మీ సంసారమంతా తెచ్చి మా గొంతుమీద కూచోబెడితే మే మెక్కడ భరించం ఊళ్ళో వాళ్ళందర్నీ? ఆ సుబ్బాం, వెంకామూ యింతే. వున్నన్నాళ్లూ యీవిధంగా మా ప్రాణాలు నిలువునా తోడారు. చీటికి మాటికి మమ్మల్ని వేధించక లెఖ్ఖప్రకారం మీ పని మీరు చేసిపోతే మీకు పదివేల దణ్ణాలు" అంది తన భార్య విదిలించేసినట్టు.

ఇంతలోనే కొత్త పనిమనిషిమీద తన భార్య కోపం తెచ్చుకోటం వెంకట్రామయ్యకు గుండెదడ సాగినట్టయింది. ఇదిగో ఈ అసహనంతోనే తన భార్య మెళుకువ లేకుండా ప్రవర్తించి సమస్యను గొంతుమీదకు తెచ్చి, తను హైరానపడి, నన్ను హైరాన పెడుతుంది. పనివాళ్ళ నావిధంగా దులిపేస్తే వాళ్లు చేసేపని మీద వాళ్ళకే విశ్వాసం లేక నాలుగురోజులు ఎగనామం పెడితే మనపని దుమ్మెత్తి పోసుకోటం, ఆ బావి జీవానబడి ఏడవటమున్ను!

అయినా ఆ విధంగా రత్తమ్మ తన కుటుంబాన్నంతా కలుపుకుని తమమీదకు దండెత్తిరావటం తన భార్యా తనూ సహించటం కష్టం అనుకున్నాడు వెంకట్రామయ్య.

"మాకు దణ్నాలేమిటండమ్మగోరు. పాపం సుట్టుకుంటది, బీదోళ్ళం. తమవంటోరి పంచను బతుకుతుంటాం. తమనిగాక యింకెవుల్ని అడుక్కుతింటాం అమ్మగోరూ? ఇంతుంటే పెడతారు, లేకపోతే లేదంటారు" అంది రత్తమ్మ.

"రత్తమ్మా అటుచూడూ–చూడూ మీ అమ్మ దగ్గి అక్కడే ఉమ్మేస్తున్నది– ఛీ పాడు క్షయరోగాలు పట్టుకుంటాయ్ అలా ఎక్కడపడితే అక్కడ ఉమ్మేస్తే– అయినా యిదేమిటి పాడూ! మా యిల్లేం నడిబజారనుకుందా, పెంటపోగనుకుందా ఆ మనిషి? నీకు పుణ్యముంటుంది. మీ అమ్మను యింటికి పంపవే రత్తమ్మా" అంది తన భార్య.

దగ్గుతెరొచ్చి తెలవకుండా కల్లె పడిపోయింది. కోపం సెయ్యకండి అమ్మగోరూ. ఎంత తెలవకపోయినా యీడ తమింటో ఎట్ట ఉమ్తూత్తానండీ– సీ సచ్చిందాన్ని–" అంది రత్తమ్మతల్లి.

"బాగానేవుంది సంబడం– నువ్వు పనికాస్త తొందరగా కానిచ్చిపోమ్మా రత్తమ్మ తల్లీ– అదేమిటి– చూడవే రత్తమ్మా నీ పిల్ల బయటికి కూచున్నట్టుంది– రామరామ యిదేం పాపఖర్మ– పాపం బద్దలైంది– పీడా విరిగిపోనూ తియ్యవేమే చూస్తావూ– ఖర్మగాల" అంది తన భార్య అంతిమస్థాయి నందుకుంటూ.

"పీడగీడంటున్నారు పసిగుడ్డు దానికేం తెలుసుద్దండీ– సిన్న పిల్నిఆవజాన అనమోకండీ అమ్మగారూ, పెద్ద కష్టంగుంటదీ" అంది రత్తమ్మ.

"అడుక్కుతిన్నట్టే వుంది అభిమానం– ఇదిగో నీ కిష్టముంటే ఒక్కత్తే ఒచ్చి పనిచేసి పోతావా పో. లేకపోతే నీ దారి నీది. ఈ విధంగా మా మీద దాడి సాగిస్తేమటుకు వూరుకునేది లేదు. నీ యిష్టం తర్వాత" అని గిరవాటు వేసినట్టన్నది తన భార్య.

ఇహ కూచున్న చోట ఎంతమాత్రం కూచోలేక దొడ్లో జరుగుతున్న సంఘటనలకు అసమ్మతి సూచకంగా పెద్దశబ్దంతో గభాల్న తలుపు తెరిచి ఠపీమని మూసి యింట్లోంచి ఎటుగానో వెళ్ళిపోయాడు వెంకట్రామయ్య.

* * *

"ఇవ్వాళ కూడా యీ రత్తమ్మ పనికి రానట్టేనా?" అన్నాడు వెంకట్రామయ్య దీనంగా బావి లోతు చూస్తూ.

''బలవంతంగా వెళ్ళమనేంతదాకా తెచ్చుకుని మరీ వెళ్ళింది'' అంది రంగనాయకమ్మ అంట్లు బయటపడవేస్తూ.

"మొత్తానికి ఏమయితేనేం పర్యవసానం నువ్వంట్లదగ్గర, నేను బావి దగ్గర మిగిలాం. అవసరం వున్న పనిమనిసికీ మనకూ మధ్య ఒక పెద్ద గొయ్యి యేర్పాటయి కూర్చుంది" అన్నాడు వెంకట్రామయ్య.

"ఆ గొయ్యి నేనే తవ్వానంటారా ఏమిటి?" అంది రంగనాయకమ్మ.

"సమస్య ఎవ్వరు తవ్వటమనేది కాదు, గొయ్యి ఏర్పట్టమే కావలసింది. రత్తమ్మ గాకపోతే వెంకమ్మ. ఎవరైనా ఒకటిగానే వుంది మనకు" అన్నాడు వెంకట్రామయ్య.

"మీ సూటిపోటి మాటలు అనవసరంగా నా మీద ప్రయోగించకండి, ఆ గూడెంలోని గుంపునంతా తెచ్చి శక్తివుంటే మీరే పోషించండి. అయినా ఒక్క పనిమనిషిని మాట్లాడుకుంటే కుటుంబమంతా వచ్చి యిక్కడే తిని పడుకుంటావంటారేం– ఛీ యీ సూద్ర సన్నాసి మూకకు సిగ్గా? ఎగ్గా? డబ్బాపోయి శని పట్టుకున్నట్టు ఉంది. యిదేం పాపఖర్మ!" అంది రంగనాయకమ్మ.

"సరే రోజూ వుండేదానికి యింత గట్టిగా ఎక్కడ విచారిస్తూ కూచుంటాం.... యీ రత్తమ్మ కన్నా ఆ సుబ్బామే నయమల్లే వుంది. కిక్కురుమనకుండా పని చేసుకుపొయ్యేది. ఆ అయిదు రూపాయలు యిచ్చినా పై నెలలో బిగబట్టుకునేవాళ్ళం" అన్నాడు వెంకట్రామయ్య.

"ఇంకా నయం! తీరా యిచ్చారుకాదు! అంతకుముందు అది ఎన్ని అర్ధణాలు, అణాలు దిగమింగిందో మీకేం తెలుస్తుంది? దానికన్న అంతకుముందు వెంకామే కాస్తనయం. నాలుగు రూపాయిల జీతాన్ని ఐదు రూపాయలు చేయమంది. చివరికి పట్టుదలకంటూ పోయి తర్వాత పనిమనిషికి యింకో రెండు ఎక్కువే యిచ్చుకున్నాం. అన్నట్టు ఈ సుబ్బాం తన మొగుడుకి జబ్బుగా వుందనే పోయిందిగాని పని మానుకుంటానని గట్టిగా చెప్పినట్టు లేదే" అంది రంగనాయకమ్మ.

"అవును దాని మొగుడికి ఏదో జబ్బు చేసిందికాదూ! ఎట్లా ఉందో పాపం?" అన్నాడు వెంకట్రామయ్య.

"టైఫాయిడు జ్వరం అనుకున్నారు గాదుటండీ, ఏమో పాపం, ఏం తెలిసినా మనం మానుస్తామా! ఈపాటి కింకా తగ్గకుండా వుంటుందా? సుబ్బాం దాని మొగుడు ఊరు వెళ్ళిందంటలెండి, లేకుంటే యీపాటికి పాపం ఎట్లా వుందో విచారించి తెలుసుకుందుం" అంది రంగనాయకమ్మ.

"పాపం పుణ్యం మనకెందుకు, ఎంత ఖర్చు కావడంలేదు! ఆ ఐదు రూపాయలు యిచ్చివుంటే యెంతోకొంత ఆ రోగిష్టికి ఉపకరించేదేమో. ఇట్లాంటివి ప్రాణం పీకుతూనే ఉంటయ్" అన్నాడు వెంకట్రామయ్య.

"చీటికి మాటికి ప్రాణం తోడుతుంటే ప్రాణం విసిగి వీళ్ళకేం యివ్వబుద్ధి పుట్టదుగాని లేకపోతే అంత కర్కోటకంగా మనం మటు కెందుకుంటాం చెప్పండి" అంది రంగనాయకమ్మ సానుభూతి తెలియజేస్తూ.

"ఇంకా పనిమనుషు లెవరయినా యీ ఊళ్లో దొరుకుతారేమో విచారించి చూడు" అన్నాడు వెంకట్రామయ్య.

"సమయం చూసి మీరు బాగా హాస్యంగా మాట్లాడతారండీ! రెండు కడవల నీళ్ళు ఆ బావిలోంచి లాగటానికి కిందామీదా పడ్డారుగాని యీ డొంకతిరుగుడు తెలవితేటలు యెందుకండీ వుపయోగిస్తారు!" అంది రంగనాయకమ్మ అంట్లవద్ద కూచుంటూ.

"ఏదోపాపం నీ చేతులకు కారలు, మిరియాలు రాసినట్లున్నదని" అన్నాడు వెంకట్రామయ్య బావిలో నీళ్ళు లాగుతూ.

"చాల్లే కట్టిపెట్టండి యుద్ధం! ఎవ్వరయినా వింటే ఇట్టే నవ్విపోతారు. అయ్యో! ప్రయోజకత్వం- ఎవరదీ?"

"నేనే దొరసానమ్మగోరూ-సుబ్బాన్ని" అంది సుబ్బాం, అక్కడికొచ్చి నిలబడుతూ.

రంగనాయకమ్మ అంట్లదగ్గర్నుంచీ, వెంకట్రామయ్య బావిదగ్గర్నుంచీ నిద్దర్లో నడిచినట్లు యివతలికొచ్చి సుబ్బాన్ని వింతగా చూస్తూ నుంచున్నారు.

"బాగుండారా దొరసానమ్మగోరూ" అంది సుబ్బాం తలవంచుకుని.

"ఎప్పుడొచ్చావే సుబ్బాం వూరునుంచి?" అంది రంగనాయకమ్మ.

"నీ మొగుడుకు నయమయిందంటే?" అన్నాడు వెంకట్రామయ్య.

"పాపం! ఎట్లావుందే నీ మొగుడుకి" అంది రంగనాయకమ్మ.

ఆయనప్పుడే పోయినాడు గదంటుండి- యేదోలెండి బతికినన్నాళ్ళూ ఏదో రోగాలతో తీసుకుంటానే ఉన్నాడు-" అంటూ బావురుమంది సుబ్బాం.

వెంకట్రామయ్య, రంగనాయకమ్మలు నిర్ఘాంతపోయి అలాగే నిలబడిపోయారు సుబ్బాంకేసి చూస్తూ.

"అమ్మగోరూ యెవుర్నన్నా పనికి కుదుర్చుకున్నారా!" అంది సుబ్బాం కొంచెం సేపయినాక రంగనాయకమ్మ, వెంకట్రామయ్యలవైపు ఆశతో చూస్తూ.